


మీ కోసమే వెయిటింగ్ : ఆనందంగా స్వాగతం పలుకుతున్న యువత






నీరాజనసీమ





పి.గన్నవరంలో గుర్తుపెట్టుకోండి..





పవర్ స్టార్ ఆనందం : అభిమానం చూసి ఇలా..



మీ వెంటే : బాబు, పవన్‌తో అమలాపురం అభ్యర్థి ఆనందరావు

- వెల్లువెత్తిన అభిమానం
- అడుగడుగునా ఘన స్వాగతం
- కొబ్బరికి పూర్వవైభవం తెస్తాం
- బహిరంగ సభలో చంద్రబాబు, పవన్
- అంబాజీపేట,అమలాపురంల్లో సక్సెస్

అమలాపురం/అంబాజీపేట (ఆంధ్రజ్యోతి), ఏప్రిల్ 11 : కోనసీమలో గన్నవరం గర్జించింది.. అమలాపురం అదరగొట్టింది.. కోనసీమ టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు నీరాజనసీమగా మారింది..ఎటు చూసినా జనమే.. ఎక్కడ చూసినా జనమే.. ఎక్కడి కక్కడ పువ్వులు చల్లుతూ అభిమాన నేతలకు ఘనంగా స్వాగతం పలికారు.. కోనసీమ అభిమానం రుచి చూపించారు..టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రోడ్‌షోకు ప్రజలు అపూర్వ రీతిలో స్వాగతాలు పలికారు. మహిళలైతే రోడ్లపైకి వచ్చి హారతులు ఇచ్చారు. ఆరు కిలోమీటర్ల రోడ్‌షో గంటన్నర సమయం పైగా సాగింది. రోడ్లకు ఇరువైపులా వేల సంఖ్యలో ప్రజలు బారులు తీరి స్వాగతం పలికారు. అంబాజీపేటలో మెయిన్‌రోడ్డుమీదా, అమలాపురంలో గడియార స్తంభం సెంటర్‌లో సభ, రోడ్‌షో సుమారు నాలుగు గంటలపాటు జరిగాయి. దీంతో నేతలు ఉబ్బితబ్బిబయ్యారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌లు ఈసారి స్థానిక సమస్యలపైనే దృష్టి సారించి రెండు సభల్లోను ప్రసంగాలు చేశారు. ప్రభుత్వ వ్యతిరేకతకు అద్దంపట్టే స్పందన ఇక్కడ కనిపిస్తోంది. ఇక్కడ ఎన్నికలు లాంఛనమే. మనమే గెలుస్తున్నాం. మన ఆడబిడ్డల స్పందన చూ స్తుంటే, వీర వనితలు అయితే ఎప్పుడు పోలింగ్ వస్తుందా అని ఎదురుచూస్తున్నారు. సిద్ధం అంటున్న జగన్‌కు ఇక యుద్ధమేనని చంద్రబాబు అన్నారు. పి.గన్నవరం నియోజకవర్గంలో గాజు గ్లాసు..అమలాపురంలో సైకిల్ గుర్తులకు ఓట్లేసి తద్వారా జగన్మోహన్‌రెడ్డి గుండెల్లోకి గుచ్చేందుకు చూస్తున్నారు. సిద్ధం.. సిద్ధం అంటున్న జగన్‌ను తన్ని తరిమికొట్టాలన్నారు. కోనసీమకు వన్నె తెచ్చిన వ్యక్తి బాలయోగి అన్నారు. బాలయోగిని స్పీకర్‌గా చేసిన పార్టీ టీడీపీ అన్నారు. గోదావరి జిల్లాలో చిచ్చుపెట్టి చలికాచుకునే పరిస్థితుల్లో జగన్ ఉన్నాడని చంద్రబాబు విమర్శించారు. గోదావరి ఉన్నా మీకు ఇసుక అందుతుందా అని చంద్రబాబు ప్రశ్నించారు. టీడీపీ హయాంలో రూ.1000కే ఇసుక అందేదన్నారు. ఇప్పుడు రూ.5 వేలు ఇస్తేకానీ ఇసుక రావడంలేదన్నారు. ఎవరికిపోతున్నాయి ఈ డబ్బులు అని ప్రశ్నించారు. గోదావరి జిల్లాలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని చంద్రబాబు అన్నారు. కోనసీమ కొబ్బరికి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కృషిచేస్తానన్నారు. అలాగే వరికి గిట్టుబాటు ధర కల్పించి రైతుల వద్ద నుంచి పూర్తి స్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం హలో ఏపీ... బై బై జగన్ అంటూ చంద్రబాబు ప్రజలతో నినాదాలు చేయించారు. పవన్‌కల్యాణ్ మాత్రం స్థానిక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రజల సమక్షంలో ఎండగట్టారు. బాబు చిట్టి అంటూ.. పరోక్షంగా స్థానిక ఎమ్మెల్యే చిట్టిబాబు పేరు ప్రస్తావించకుండా ఆయనపై విమర్శనాస్త్రాలు సంధించారు. జగన్ గన్నవరం నియోజకవర్గంలో పర్యటించినప్పుడు ఎమ్మెల్యే చిట్టిబాబు సూచించిన రూ.200 కోట్ల విలువైన హామీలను అయితే ఇచ్చేశారు. ఇప్పటివరకు వాటికి అతీగతీ లేదు. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల నుంచి గోదావరి రివెట్‌మెంట్లు, కాజ్‌వేల నిర్మాణం, నాడు-నేడు వంటి అంశాలపై వివరణాత్మక విశ్లేషణ చేస్తూ జగన్ ఈ ప్రాంత ప్రజలను ఏవిధంగా మోసగించారో స్పష్టంచేశారు. బాలయోగి జీవిత లక్ష్యమైన కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్‌ను నిర్మించి పర్యాటకంగా కూడా అభివృద్ధి చేస్తామన్నారు.ఆర్బీకేలు కాకినాడకు చెందిన ఒక మాఫియా లీడర్ చేతిలో ఉన్నాయని ఆరోపించారు. యువత ఇంటి వద్దే ఉండి ఉపాధి పొందేలా వర్క్ ఫ్రమ్ హోం మాదిరిగా ఉద్యోగ అవకాశాలను కల్పించడమే తెలుగుదేశం లక్ష్యమని చంద్రబాబునాయుడు అమలాపురం సభలో స్పష్టం చేశారు. చంద్రబాబు తన ప్రసంగాన్ని సూపర్-10 పథకాలను వివరిస్తూ సరిగ్గా 9.55 గంటలకు ముగించారు. చంద్రబాబునాయుడు కిమ్స్‌లో నైట్ హాల్ట్‌కు బయలుదేరి 10.15 గంటలకు చేరుకున్నారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అమలాపురం నుంచి నేరుగా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని నివాసానికి వెళ్లారు.





మీకు అండగా ఉంటా : నిడదవోలు రంజాన్ వేడుకలో మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు

బిజిబిజీగా అధినేతలు

- నిడదవోలులోనే చంద్రబాబు రంజాన్ వేడుక
- రాజమండ్రిలో పలువురు నేతలతో పవన్ భేటీ

రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి/నిడదవోలు/రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 11: టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ గురువారం సాయంత్రం 4 గంటల వరకూ జిల్లాలోనే ఉన్నారు. నిడదవోలు ప్రజాగళం సభ ముగిసిన అనంతరం బుధవారం రాత్రి చంద్రబాబు నిడదవోలులో బస చేయగా, పవన్ కల్యాణ్, పురందేశ్వరి రాజమహేంద్రవరం షెల్టన్ హోటల్‌లో బసచేశారు. చంద్రబాబు గురువారం సుమారు 12 గంటల ప్రాంతంలో తిరుమలసాయి కల్యాణ మండపంలో ముస్లింలతో కలిసి రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కేక్ కట్ చేసి ముస్లింలకు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలిపారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వంలో 10 లక్షల మంది పేద ముస్లింలకు ఉచితంగా రంజాన్ తోఫా అందజేసేవారమన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ముస్లింలకు ఆ సంతోషం ఉందా అని ప్రశ్నించారు. గతంలో టీడీపీ ప్రభుత్వం దుల్హన్ పథకం ద్వారా ముస్లిం పెళ్లి జంటలకు రూ.50వేలు అందజేసేవారమని, తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒక్కో జంటకు రూ.లక్ష అందజేస్తామన్నారు. రంజాన్ పండుగను ముస్లింలతో జరుపుకోవడం ఆనందం ఉందన్నారు. చిత్తూరు జిల్లా చంద్రగిరి నియోజకవర్గానికి చెందిన డాలర్ దివాకర్‌రెడ్డి, పెరవలికి చెందిన పసలపూడి భద్రయ్యలకు పసుపు కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. నిడదవోలులో పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సాయంత్రం నాలుగు గంటలకు బ్రాహ్మణగూడెంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకుని హెలికాప్టర్‌లో అంబాజీపేట వెళ్లారు. ఇక పవన్ కల్యాణ్ కూడా షెల్టన్ హోటల్ నుంచే పార్టీ వ్యవహారాలు చూశారు. ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ రాజమహేంద్రవరం అర్బన్, రూరల్, భీమవరం తదితర నియోజకవర్గాల నుంచి పోటీలో ఉన్న తెలుగుదేశం, జనసేన పార్టీ అభ్యర్థులు, ఆయా నియోజకవర్గాల ముఖ్య నాయకులతో విడివిడిగా సమావేశమయ్యారు. నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు, పితాని సత్యనారాయణ, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు, భీమవరం అభ్యర్థి అంజిబాబు, కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, అనుశ్రీ సత్యనారాయణ వంటినేతలు కలిశారు. ఉదయం నాగబాబు పవన్‌ను కలిసి వెళ్లారు. సాయంత్రం 4 గంటల తర్వాత పవన్ కారులో మధురపూడి విమానాశ్రయానికి చేరుకుని అక్కడ నుంచి హెలికాప్టర్‌లో అంబాజీపేట వెళ్లారు. మరో పక్క బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పార్టీ కార్యక్రమాల్లో బిజీగా గడిపారు. అనపర్తి మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి పురందేశ్వరితో గురువారం సాయంత్రం భేటీ కావడం గమనార్హం. రేపో మాపో అనపర్తి సీటు విషయంలో స్పష్టత రావచ్చని భావిస్తున్నారు.

నా తండ్రి..బాలయోగి ఆశయ సాధనకు కృషి

ఐదేళ్ల రాక్షస పాలనలో ప్రజలెన్నో కష్టాలు పడ్డారు. మరో 32 రోజుల్లో ఎన్నికలు జరుగుతాయి. రానున్నది డబుల్ ఇంజన్ సర్కారే.. అధికారంలోకి వచ్చిన వెంటనే పార్లమెంట్ పరిధిలో ఉన్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం. నా తండ్రి.. దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి ఆశయ సాధనకు కృషిచేస్తా. కోనసీమ ప్రజల చిరకాలవాంఛ రైల్వేలైన్ పూర్తయ్యే విధంగా కృషిచేసి ఈ ప్రాంత వాసులకు రైల్వే కూత వినిపిస్తా.

- హరీష్‌మాధుర్, అమలాపురం పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి

అవకాశం ఇస్తే.. మంచి చేసి చూపిస్తా..

పి.గన్నవరం నియోజకవర్గంలో సమస్యలపై దృష్టి సారించా.. కొత్తగా వచ్చానని అనుకోవద్దు.. ఇప్పటి వరకూ పోలీస్ సేవలో ఉన్నా.. అవకాశం ఇస్తే మంచిచేసి చూపిస్తా.. నదీపరీవాహక ప్రాంతాల్లో గ్రోయిన్స్ రివిట్‌మెంట్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటా.కూటమి ప్రభుత్వాన్ని గెలిపించాలి.నాకున్న అనుభవంతో నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా.

- గిడ్డి సత్యనారాయణ, పి.గన్నవరం జనసేన అభ్యర్థి

జగన్ దుర్మార్గాలకు ఓటుతో బుద్ధి చెప్పండి

రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనను అంతమొందించేందుకు సమయం ఆసన్నమైంది.. జగన్ దుర్మార్గాలకు ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలి. రాష్ట్రంలో డ్వాక్రా మహిళా సంఘాలను ఏర్పాటుచేసి ఎందరికో ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత టీడీపీ అధినేత చంద్రబాబుదే.. రాష్ట్రంలో దుర్మార్గపు పాలన అంతమొందించడానికి, దోపిడీలను అరికట్టడానికి, మాఫియాలకు గుణపాఠం చెప్పడానికి మోసగాడు జగన్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజల వద్ద ఉన్న వజ్రాయుధమే ఓటు.

- అయితాబత్తుల ఆనందరావు, అమలాపురం టీడీపీ అభ్యర్థి



బై బై జగన్ : చంద్రబాబు పిలుపుతో చేతులెత్తిన జనం

చంద్రబాబు, పవన్‌ను చూద్దామని..

అంబాజీపేటలో అదిరిన రోడ్ షో..

అభిమానుల షో : ఉరకలేసిన ఉత్సాహం

మీ కోసమే కలిసి వచ్చాం : అంబాజీపేట రోడ్ షోలో నమస్కరిస్తున్న చంద్రబాబు, పవన్

సంక్షేమం పేరుతో మంత్రి దోపిడీ : చంద్రబాబు

స్థానిక మంత్రి పేదలకు ఇళ్ల స్థలాల పేరుతో వంద ఎకరాల భూమిని సేకరించారు. ఎకరాకి రూ.10 లక్షలు చొప్పున మింగేశారు. ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణానికి 50 ఎకరాల భూమిని రైతుల నుంచి సేకరించారు. ప్రభుత్వం రూ.75 లక్షల చొప్పున చెల్లిస్తే రైతులకు రూ.50 లక్షలు మాత్రమే ఇచ్చి ఎకరాకు రూ.25 లక్షలు చొప్పున మింగేశారు. మునిసిపల్ పార్కింగ్ స్థలాన్ని మంత్రి అనుచరులే అద్దెకు తీసుకున్నారు. అమలాపురంలో తాగునీరు, డ్రైనేజీ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తా. చేనేత కార్మికులకు రూ.24వేలు పథకాన్ని కొనసాగిస్తాం.40లక్షల మంది భవన నిర్మాణరంగ కార్మికులను అన్నివిధాలా ఆదుకుంటా. జిల్లా కేంద్రమైన ఈ ప్రాంతంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలిటెక్నికల్ కళాశాల, ఐటీఐలను ప్రభుత్వపరంగా ఏర్పాటుచేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.వారి కోసం ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏర్పాటుచేసేలా చర్యలు తీసుకుంటాం. అమలాపురంలో శెట్టిబలిజ కల్యాణ మండపం నిర్మించాలని కోరగా ఆయన సమ్మతించారు.పనులు చేసే బాధ్యత మాది, కూటమికి ఓటేసి గెలిపించే బాధ్యత మీదని చంద్రబాబు అన్నారు.

ఎవడ్రా మనల్ని ఆపేది : పవన్

కుల వైషమ్యాలను రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకున్నది వైసీపీ ప్రభుత్వమేనని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అమలాపురం సభలో ఆరోపించారు. పచ్చని కోనసీమను కలహాల సీమగా మార్చేశారు. ఇక్కడ కులాల మధ్య అంబేడ్కర్ పేరును లక్ష్యంగా చేసుకుని చిచ్చు పెట్టారు. లబ్ధి పొందాలని చూశారు. వైసీపీ మంత్రి ఇల్లును ఆ పార్టీవారే తగలు పెట్టుకునేలా చేశారన్నారు. కోనసీమ రైల్వేలైన్ లక్ష్య సాధనగానే ఉమ్మడి ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. జనసేనను కొందరు నాయకులు వదిలి వెళ్లిపోయారు. నాయకులు వస్తారు వెళతారు. కానీ పార్టీని అంటిపెట్టుకుని ఎంతటి త్యాగానికైనా సిద్ధపడేది జనసైనికులు, వీర మహిళలేనన్నారు.గతంలో అమలాపురం సభలో హలో ఏపీ.. బైబై వైసీపీ అనే స్లోగన్‌ను ఇక్కడి నుంచే ప్రారంభించారు. మనల్ని ఆపేది ఎవడ్రా అంటూ పవన్ ఆగ్రహంగా ప్రసంగించారు.



దివాన్‌చెరువులోని నమూనా ఈవీఎం వద్ద మిశ్రా, కలెక్టర్, ఎస్పీ, యువత

వాహనాలపై నిఘా పెట్టండి : మిశ్రా

రాజానగరం/దివాన్‌చెరువు/కడియం, ఏప్రిల్ 11 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జాతీయ రహదారిపై తరచూ తిరిగే వాహనాల రాకపోకలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సార్వత్రిక ఎన్నికల సాధారణ పరిశీలకులు రామ్ మోహన్ మిశ్రా ఆదేశించారు. జిల్లా పర్యటనలో భాగంగా జాతీయ రహదారిపై తూర్పుగోనగూడెం, కడియం మండలం పొట్టిలంక వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు.కలెక్టర్ మాధవీలత మిశ్రాకు పలు విషయాలను వివరించారు. జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి కంట్రోల్ రూమ్ ద్వారా వివిధ చెక్ పోస్టలపై నిఘా పెట్టామని తెలిపారు. చెక్ పోస్ట్ వద్ద ఎక్సైజ్, పోలీస్, అటవీశాఖ, రెవెన్యూ తదితర శాఖల ఉద్యోగులు ఆధ్వ ర్యంలో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో చైత్రవ ర్షిణి తెలిపారు. దివాన్‌చెరువు జీరోజంక్షన్ వద్ద అధికారులు ఏర్పాటు చేసిన నమూనా ఈవీఎం సందర్శించారు. ఆయన వెంట ఎస్పీ పి.జగదీష్, డీటీ సునీత, ఎంపీడీవో జి.జ్యోతిర్మయి, ఆర్ఐ ఆర్.సీతారామయ్య,కార్యదర్శి కె.కిరణ్‌కుమార్, వీఆర్‌వోలు చంటి, రామజోగి ఉన్నారు.

ఎన్నికల్లో బూత్ కమిటీలు కీలకం

బీజేపీ ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి



సమావేశానికి హాజరైన బీజేపీ కార్యకర్తలు, మాట్లాడుతున్న పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 11 : ఎన్నికల్లో పోలింగ్ బూత్ కమిటీలు కీలకంగా వ్యవహరించాలి అని..అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని బీజేపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. రాజమహేంద్రవరం బీజేపీ పార్లమెంట్ ఎన్నికల కార్యాలయంలో గురువారం ముందుగా జ్యోతిరావ్‌పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ అసెంబ్లీ నియోజకవర్గాల శక్తి కేంద్రాలు, పోలింగ్ బూత్ కమిటీలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. పోలింగ్ బూత్ కమిటీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న కార్యకర్తలకు భవిష్యత్తులో పార్టీ మంచి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి, వారి చదువు కోసం కృషి చేసిన సామాజిక దార్శనికుడు జ్యోతిరావు పూలే అన్నారు.జ్యోతిరావు పూలే ఆశయసాధనే బీజేపీ లక్ష్యం అన్నారు. సమాజంలోని అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలన, మహిళల సంక్షేమం కోసం పూలే ఎంతో పాటుపడ్డారన్నారు. ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాలెపు సత్యసాయిరాం, నాయకులు కాశీ విశ్వనాథరాజు, దత్తు, రేలంగి శ్రీదేవి, కురగంటి సతీష్ పాల్గొన్నారు.



చంద్రబాబుకు కాంట్రాక్టు వైద్య ఉద్యోగుల వినతి

వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల వినతి

నిడదవోలు, ఏప్రిల్ 11 : వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంటు చేస్తామని నమ్మించి మోసగించిందని వైద్య ఉద్యోగులు అన్నారు. నిడదవోలులో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుని వైద్య ఆరోగ్యశాఖలో నేషనల్ హెల్త్‌మిషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల రాష్ట్ర నాయకురాలు డి.దయామణి కలిసి వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తమ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు.



జ్యోతిరావ్ పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జేసీ

జ్యోతిరావ్ పూలేకు ఘన నివాళి

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 11 : ప్రతి ఒక్కరూ వారు అనుకున్న లక్ష్యాలను, ఆశయాలను ఆచరణలో పెట్టడంలో జ్యోతిరావ్ పూలే దంపతులను ఆదర్శంగా తీసుకోవాలని జేసీ తేజ్ భరత్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం మహాత్మ జ్యోతిరావ్ పూలే 197వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.వారు స్త్రీ విద్యను ప్రోత్సహించడంతో పాటు బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. ఆనాటి పరిస్థితులను ఎదురించి విద్య ఆవశ్యకతను ముఖ్యంగా స్త్రీ విద్య ప్రాముఖ్యతను చాటి చెప్పారన్నారు.బాలికల విద్యకు సావిత్రిబాయి పూలే ప్రత్యేక పాఠశాలలను ప్రారంభించారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో జి.నరసింహులు,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ఎం.భవానీ ప్రకాశ్, బీసీ సంక్షేమ అధికారి పి.రమేశ్ బాబు, సాంఘిక సంక్షేమ అధికారి ఎం.సందీప్, గిరిజన సంక్షేమ అధికారి కేఎస్.జ్యోతి, ఏడీఏ ఎస్.మాధవరావు, డీఈవో కె.వాసుదేవరావు, డ్వామా పీడీ ఏ.ముఖలింగం పాల్గొన్నారు.

అడవిలో రాజుకున్న మంటలు అదుపులోకి..



మంటలను అదుపు చేస్తున్న సిబ్బంది

మోతుగూడెం, ఏప్రిల్11: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో మూడు రోజులుగా అడవిలో రాజుకున్న మంటలను అటవీ శాఖ సిబ్బంది అదుపు చేసే ప్రయత్నం చేశారు. గత మూడు రోజులుగా అడవులు అంటుకుని కాలుతుంటుంటే చుట్టుపక్కల గ్రామాలకు పొగ కమ్మేసింది. దీనిపై ఆంధ్రజ్యోతిలో వార్తా కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించి డీఎఫ్‌వో బబిత ఆదేశాలు ప్రకారం లక్కవరం రేంజ్ వెంకట నానాజీ ఆధ్వర్యంలో సిబ్బందిని అప్రమత్తం చేశారు. గొందిగూడెం బీట్ సుకుమామిడి సౌత్ చింతూరు బౌండరీ డివిజన్ మారేడుమిల్లి బౌండరీ డివిజన్‌లో దగ్ధమవుతున్న అడవులను నీటితో ఆర్పి అదుపు చేశారు. బీట్ ఆఫీసర్ వెంకట్, స్ట్రైక్ ఫోర్స్ సిబ్బంది రవి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం దర్గాలో హైపర్ ఆది ప్రత్యేక ప్రార్థనలు



ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన జనసేన స్టార్ క్యాంపెయినర్

పిఠాపురం, ఏప్రిల్ 11: పిఠాపురం పట్టణంలో వస్తాదు వీధి దర్గాలో సినీ నటుడు, జనసేన స్టార్ క్యాంపెయినర్ హైపర్ ఆది ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. పిఠాపురంలో పవన్ గెలుపు కోసం ప్రార్థనలు చేశామని హైపర్ ఆది తెలిపారు. పవన్ విజయం సాధిస్తే పిఠాపురం నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని, యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. అలాగే పట్టణంలోని కత్తుల గూడెం, పక్షులమర్రిచెట్టు సెంటర్, గాంధీబొమ్మ సెంటర్, మెయిన్‌రోడ్డు, కాకినాడ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉన్న మసీదుల్లో ముస్లింలు గురువారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పరస్పరం అలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రార్థనల్లో చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రంజాన్ సందర్భంగా పట్టణమంతా పండుగ వాతావరణం నెలకొంది. నెలరోజులు పాటు చేసిన ఉపవాస కార్యక్రమాలు ముగిశాయి. ప్రజాప్రతినిధులు, నాయకులు మసీదుల వద్దకు వెళ్లి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

అన్నప్రసాద భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం



దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఏప్రిల్ 11: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి రావులపాలానికి చెందిన వెలగల కాశీవిశ్వేశ్వరరెడ్డి-వెంకటలక్ష్మి దంపతులు రూ. 1,11,116 విరాళం సమర్పించారు. వివిధ సేవల ద్వారా గురువారం ఒక్కరోజు ఆదాయం రూ.2,88,200 లభించినట్టు ఉప కమిషనరు భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. వాడపల్లి వెంకన్నను ప్రముఖ రచయిత, నటుడు తనికెళ్ల భరణి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

18 నుంచి వాడపల్లి వెంకన్న కల్యాణోత్సవాలు



ఆత్రేయపురం, ఏప్రిల్ 11: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలను ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు రానున్న నేపథ్యంలో వివిధ శాఖల అధికారులు చేపట్టాల్సిన చర్యలపై ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ శుక్రవారం సాయంత్రం రెండోసారి సమీక్షించనున్నారు. ఉత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఉప కమిషనరు భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

జూదం ఆడుతున్న 16 మందిపై కేసు

రాజవొమ్మంగి ఏప్రిల్ 11: శాంతినగర్ గ్రామ శివారులో బొమ్మ బొరుసు ఆట(చిత్తులాట) ఆడుతున్న 16 మందిపై కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి రూ.4750 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకయ్య తెలిపారు. డబ్బులు పనంగా పెట్టి ఇటువంటి ఆటలు ఆడి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఎస్ఐ సూచించారు.

ప్రధాన పంట కాల్వలో బాలుడు గల్లంతు

పి.గన్నవరం, ఏప్రిల్ 11: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం లంకల గన్నవరం ప్రధాన పంట కాల్వలో 11ఏళ్ల బాలుడు గురువారం ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... లంకలగన్నవరం ఏటిగట్టు చెంతనే ప్రధాన పంట కాల్వ ఎదురుగా నివాసం ఉంటున్న గుడాల దుర్గాప్రసాద్-జ్యోతి దంపతులకు ముగ్గురు కుమారులు. వారిలో పెద్ద కుమారుడు సాయినాగేంద్ర (11) దివ్యాంగుడు. పాఠశాలకు సెలవు కావడంతో ముగ్గురూ ఉదయం ఇంటివద్దే ఆడుకుంటున్నారు. కాల్వ వద్దకు వెళ్లిన సాయి ప్రమాదవశాత్తు పంట కాల్వలో గల్లంతైనట్టు స్థానికుడు ఒకరు గుర్తించారు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు స్థానికుల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో తండ్రి దుర్గాప్రసాద్ రెవెన్యూ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ముగిసిన ఆహ్వాన నాటిక పోటీలు



ఇంద్రప్రస్థం నాటికలో ఓ సన్నివేశం

రావులపాలెం, ఏప్రిల్ 11: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం సీఆర్సీ కాటన్ పరిషత్ వేదికపై నిర్వహించిన 24వ ఉగాది ఆహ్వాన నాటిక పోటీలు గురువారం ఘనంగా ముగిశాయి. మూడో రోజు తొలి నాటికగా అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి 'ఇంద్రప్రస్థం' ప్రదర్శితమైంది. ఎన్. రవీంద్రరెడ్డి దర్శకత్వం వహించగా స్నిగ్ధ రచించారు. లీలామోహన్‌సంగీతం సమకూర్చారు. పచ్చల శేషగిరి ఆహార్యం వర్క్స్ నిర్వహించగా, పచ్చల శివరామకృష్ణ రంగాలంకరణ చేశారు. రెండో నాటికగా మైత్రి కళా నిలయం విజయవాడ వారి 'బంధం' ప్రదర్శించారు. టీవీ పురుషోత్తం దర్శకత్వం వహించగా మాడుగుల రామకృష్ణ రచించారు. లీలామోహన్ సంగీతం సమకూర్చారు. నిర్వహణ పీబీ కుమార్ వ్యవహరించగా, రంగాలంకరణ పిఠాపురం బాబూరావు చేశారు. మూడో నాటికగా డాక్టర్ గొలుగూరి వెంకటరెడ్డి (విక్టరీ) రచించిన కృష్ణాంజనేయం ప్రదర్శించారు. నాటకీకరణ, దర్శకత్వ బాధ్యతలు గంటా రామ్మోహనరావు తీసుకున్నారు. కళాకారులు తమ హావభావాలతో ప్రేక్షకులను ఆద్యంతం మంత్రముగ్ధులను చేశారు. అంతరించిపోతున్న నాటక రంగాన్ని, కళాకారులను ప్రోత్సహిస్తున్న సీఆర్సీకి కళాకారులు కృతజ్ఞతలు తెలిపారు.

పురందేశ్వరి దంపతులతో నల్లమిల్లి భేటీ



పురందేశ్వరి దంపతులతో మాట్లాడుతున్న నల్లమిల్లి

అనపర్తి, ఏప్రిల్ 11: టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గురువారం రాత్రి రాజమహేంద్రవరంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ అభ్యర్థిని దగ్గుబాటి పురందేశ్వరి దంపతులతో భేటీ అయ్యారు. అనపర్తి అసెంబ్లీ సీటు మార్పుపై ఇటీవల జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో మరోసారి వీరు భేటీ కావడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. అనంతరం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ అనపర్తి సీటు బీజేపీ నుంచి టీడీపీకి మార్పు చేసేందుకు ఇరు పార్టీల అధినేతలు సుముఖంగా ఉన్నారని, ఇప్పటికే టీడీపీ అధినేత చంద్రబాబు తనకు పూర్తి భరోసా ఇచ్చారని, ఒకటి రెండు రోజుల్లో ప్రకటన వెలువడే అవకాశం ఉందన్నారు.

ప్రచార వాహనాలు సీజ్

పిఠాపురం, ఏప్రిల్ 11: అనుమతులకు విరుద్ధంగా తిరుగుతున్న ప్రచార వాహనాలను పిఠాపురం ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు గురువారం సీజ్ చేశారు. పిఠాపురం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో తిరుగుతున్న ప్రచార వాహనాల అనుమతులను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు. అనుమతించిన సైజ్ కంటే అధిక సైజులో, పరిమితికి మించి వాహనాలకు ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం, ఇతర నిబంధనలు పాటించకపోవడంతో వైసీపీ అభ్యర్థి వంగా గీతావిశ్వనాథ్‌కు చెందిన మూడు ప్రచార ఆటోలను సీజ్ చేసి పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ వాహనాలకు జెండాలు, స్టిక్కర్లు, ఫ్లెక్సీలు అనుమతులు పొందిన వాటి కంటే సైజు ఎక్కువగా, అదనంగా ఉండటంతో వీటిని సీజ్ చేసినట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి పైడిరాజు తెలిపారు. జనసేనకు చెందిన ఒక వాహనాన్ని కూడా సీజ్ చేశారు.



సీజ్ చేసిన వంగా గీత ప్రచార వాహనాలు, ఒక జనసేన వాహనం

నేడు ఇంటర్ ఫలితాలు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షా ఫలితాలను శుక్రవారం ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు. ఫలితాలను http://results.bie.ap.gov.in వెబ్‌సైటు నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. గత నెల 1 నుంచి మొదటి, 2 నుంచి రెండో ఏడాది పరీక్షలు ప్రారంభమై 20న ముగిశాయి. జిల్లాలో మొదటి ఏడాది 19336, రెండో ఏడాది 18166 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. గత ఏడాది మొదటి ఏడాది 59 శాతం, రెండో ఏడాది 69 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది ఫలితాలు మరింత మెరుగ్గా ఉంటాయని అధికారులు చెబుతున్నారు.

అంతర్ జిల్లాల చెక్‌పోస్టులు తనిఖీ



చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

కరప, ఏప్రిల్ 11: కాకినాడ జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ గురువారం కరప మండలంలో పర్యటించి అంతర జిల్లాల చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. కోనసీమ జిల్లా సరిహద్దు వేళంగి, జగన్నాథగిరి గ్రామాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులతో బాటు తూర్పుగోదావరి జిల్లా సరిహద్దు గొల్లల మామిడాడ వద్ద నిర్వహిస్తున్న చెక్‌పోస్టులను ఆయన సందర్శించి సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ధన, మద్యం, నాటు సారాయి, తాయిలాలకు సంబంధించిన వస్తు సామగ్రి రవాణాకు అడ్డుకట్ట వేసే ఉద్దేశంతో అంతర జిల్లా సరిహద్దుల వద్ద ఈ చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. ఈ చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది నిరంతరం నిఘాతో వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఎలక్షన్ కమిషన్ నిర్దేశించిన విధి విధానాలను సిబ్బంది కచ్చితంగా పాటించాలని, సోదా, జప్తులకు సంబంధించిన ప్రతీ అంశాన్ని ఎస్ఎస్‌టీ బృంద సభ్యుల ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగేలా చూసుకోవాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రతీరోజు పర్యవేక్షించుకుంటూ సక్రమ నిర్వహణ ఉండేలా చూసుకోవాలన్నారు. వాహన తనిఖీల సిబ్బంది ఎండల నుంచి రక్షణ పొందేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఎస్పీ సూచించారు. కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాస్, కరప ఎస్ఐ టి.రామకృష్ణ, గొల్లపాలెం, పెదపూడి ఎస్ఐలు పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో వృద్ధుడి మృతి



తుని రూరల్, ఏప్రిల్11: తుని రైల్వే స్టేషన్ పరిధిలో నరసింగపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో సుమారు 65 సంవత్సరాల వయస్సు గల వృద్ధుడు రైలు పట్టాలు దాటుతూ ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. విశాఖపట్నం నుంచి విజయవాడ వెళుతున్న సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఢీ కొనడంతో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సంబంధీకుల వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించి భద్రపరిచినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు తుని రైల్వే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని రైల్వే ఇన్‌చార్జ్ సబ్ ఇన్‌స్పెక్టర్ లోవరాజు తెలిపారు.

14న రైతు సదస్సు

తుని రూరల్, ఏప్రిల్ 11: ఈ నెల 14న రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు శ్రీ ప్రకాష్ విద్యా సౌధం నిర్వాహకులు తెలిపారు. పాయకరావుపేటలో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ఏకే సింగ్, శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ రిటైర్డ్ డైరెక్టర్ డాక్టర్ ఎలినేని రాఘవరావు, రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ డాక్టర్ మన్మోహన్‌సింగ్, సీనియర్ సైంటిస్ట్ సి.రవీంద్రరెడ్డి హాజరవుతారని తెలిపారు.

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి

ఎటపాక, ఏప్రిల్ 11: వడదెబ్బతో ఉపాధిహామీ కూలీ మృతి చెందాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది..వివరాలు ఇలా ఉన్నాయి విస్సాపురం గ్రామానికి చెందిన కుంజా ముద్దరాజు (52) మంగళవారం గ్రామ సమీపంలో ఉపాధి హామీ పనులకు వెళ్లాడు. అయితే పని చోటే ఎండదెబ్బకు ముద్దరాజు వాంతులు, విరోచనాలతో అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు గౌరిదేవీపేట పీహెచ్‌సీకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం భద్రాచలానికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ ముద్దరాజు మంగళవారం రాత్రి మృతి చెందాడు.



ఎన్డీయే అభ్యర్థికి మద్దతుగా భారీ ర్యాలీ

యానాం, ఏప్రిల్ 11: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి ఎన్డీయే అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆ రాష్ట్ర హోం మంత్రి నమశ్శివాయకు మద్దతుగా యానాంలో గురువారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఎన్ఆర్ కాంగ్రెస్ యానాం శాఖ అధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ జరిగింది. సుమారు మూడు వేల మంది పాల్గొన్నారు. పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగసామి, ఎన్డీయే అభ్యర్థి నమశ్శివాయ, ప్రజా పనుల శాఖ మంత్రి లక్ష్మీనారాయణ హాజరయ్యారు. యర్రా గార్డెన్స్‌లోని మల్లాడి ఇంటి వద్ద ప్రారంభమైన ర్యాలీ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ సాగింది. బీజేపీకి ఓటు వేసి నమశ్శివాయను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నాయకులు, కార్యకర్తలకు మల్లాడి పిలుపునిచ్చారు. ఎన్ఆర్ కాంగ్రెస్ యానాం శాఖ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్, యానాం అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో క్రేన్‌తో అతిథులను గజమాలతో సత్కరించారు.



చంద్రబాబును కలిసిన బండారు సోదరులు

కొత్తపేట, ఏప్రిల్ 11: అంబాజీపేట ప్రజాగళం ప్రచార సభకు విచ్చేసిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడుని కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు మర్యాదపూర్వకంగా కలిశారు. తన సోదరుడైన జనసేన కొత్తపేట ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్‌ను బాబుకు పరిచయం చేశారు.

గ్యాస్ లీకై నాలుగు తాటాకిళ్లు దగ్ధం

కొండెవరం(కొత్తపల్లి), ఏప్రిల్ 11: కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం కొండెవరం గొల్లపేటలో గురువారం వంట గదిలో గ్యాస్ లీకై నాలుగు తాటాకిళ్లు పూర్తిగా దగ్ధమై సుమారు రూ.15 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. మోరుకుర్తి వెంకటరమణ, సత్తిబాబు, వీరాస్వామి, శ్రీనుకు చెందిన ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. కట్టుబట్టలతో బాధితులు రోడ్డున పడ్డారు. పిఠాపురం అగ్నిమాపక శాఖ అధికారి రామకృష్ణం రాజు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేశారు.

సమస్యల మూలాల్లోకి వెళ్లి పరిష్కరిస్తా



రెల్లి కులస్థుల సమస్యలు వింటున్న పవన్‌కల్యాణ్

మాటలు చెప్పను

పనిచేసి చూపిస్తా

పిఠాపురాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

జనసేన అధినేత పవన్‌కల్యాణ్

పిఠాపురం, ఏప్రిల్ 11: సమస్యల మూలాల్లోకి వెళ్లి వాటి పరిష్కార మార్గాలు అన్వేషించడంతో పాటు వాటిని అమలు చేస్తానని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తెలిపారు. తాను మాటలు అధికంగా చెప్పనని, ఆచరణలో పనిచేసి చూపిస్తానని చెప్పారు. పిఠాపురాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. పవన్‌కల్యాణ్‌ను పిఠాపురం పట్టణానికి చెందిన రెల్లి కులస్థులు, మరికొందరు చేబ్రోలులో మంగళవారం కలిశారు. ఆ వీడియోలు గురువారం విడుదల చేశారు. వారితో ప్రత్యేకంగా సమావేశమైన పవన్ సమస్యలు, ఇబ్బందులు తెలుసుకోవడంతో పాటు తన ఆలోచనలను పంచుకున్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం వెళ్లి ప్రజలకు, మహిళలకు ఏం అవసరం, వారి ప్రతిభ, వారికి ఏయే రంగాల్లో ఆసక్తి ఉంది తదితర విషయాలను తెలుసుకుని వారికి ఉపాధి కల్పించే దిశగా జనసేన అడుగులు వేస్తుందని పవన్ తెలిపారు. పిఠాపురాన్ని తన స్వస్థలం చేసుకుని ఇక్కడి సమస్యలపై పూర్తి అవగాహన చేసుకుని వాటి పరిష్కార మార్గాలను చూపుతానని చెప్పారు. తల్లిదండ్రులు పడ్డ బాధలు ఇక యువత పడాల్సిన అవసరం లేదని, వారు గౌరవంగా తలెత్తుకుని బతికేలా చేసే బాధ్యత తనది అని తెలిపారు. తాను మాటలు చెప్పేవాడని కానని పనులు చేసి చూపించడమే తన అభిమతమని చెప్పారు. 54 గ్రామాలు, రెండు పట్టణాల్లో ఉన్న సమస్యలన్నింటినీ పరిష్కరించే బాధ్యత తాను తీసుకుంటానని తెలిపారు. తాను ఏ పనిచేసినా ఇష్టంతో చేస్తానని, మీరు చూపించే ప్రేమ కంటే అధికంగా అంతే ప్రేమ మీ పై చూపించి పనిచేస్తానని హామీ ఇచ్చారు.

పోస్టులు అమ్ముకున్నారు

పిఠాపురం పురపాలక సంఘంలో అవుట్ సోర్సింగ్ పోస్టులను రూ.5లక్షలు వంతున అమ్ముకుంటున్నారని, విధి నిర్వహణలో ఉద్యోగి మరణిస్తే వారి కుటుంబసభ్యులకు ఉద్యోగం కావాలంటే రూ.5లక్షల వరకూ లంచం ఇవ్వాల్సి వస్తున్నదని రెల్లి కుల యువకులు పవన్ దృష్టికి తీసుకువచ్చారు. తామంతా పదో తరగతి నుంచి ఎంబీఏ వరకూ చదువుకున్నామని, అయితే ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులుగా మిగిలిపోయామని తెలిపారు. కులవృత్తిపైనే ఆధారపడి జీవనం సాగించాల్సిన పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 'తమను అక్కున చేర్చుకుని మాట్లాడింది మీరు ఒక్కరేనని రెల్లి కులస్థులు పవన్‌తో చెప్పారు. పవన్‌ను కలిసిన వారిలో అల్లం కిషోర్, బంగారు లక్ష్మి తదితరులు ఉండగా, సమావేశంలో కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ ఉన్నారు.

ఎమ్మెల్యే కొండేటి చూపు కాంగ్రెస్ వైపు?

మామిడికుదురు, ఏప్రిల్ 11: పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్టు సమాచారం. బుధవారం రాత్రి ఆయన తన అనుచరులతో సమావేశమై కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు అభిప్రాయాలు సేకరించినట్టు తెలిసింది. జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావుకు వైసీపీ టిక్కెట్ కేటాయించనప్పటి నుంచి చిట్టిబాబు కినుకు వహించి పార్టీ కార్యక్రమాలతో పాటు ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. ఇటీవల స్వగ్రామంలో జరిగిన ప్రచారానికి కూడా హాజరు కాలేదు. చిట్టిబాబు శనివారం కాంగ్రెస్‌లో చేరి పి.గన్నవరం నుంచి ఆ పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తారని సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరుగుతోంది.

పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించడమే లక్ష్యం



మాట్లాడుతున్న మధుసూదనరావు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 11: ఎస్సీ ఎస్టీ పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించడమే తమ లక్ష్యమని కేజీబీవీ రాష్ట్ర కార్యదర్శి డి.మధుసూదనరావు పేర్కొన్నారు. షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం అంబేడ్కర్ ఆశయ సాధన 'పే బ్యాక్ టు ద సొసైటీ' లో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్‌లో నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా శాఖ అధ్యక్షుడు బత్తుల నకులరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అల్లవరం ఎంఈవో కె.కిరణ్‌బాబు, సమగ్ర శిక్షా ఏపీవో ఎంఏకే భీమారావు, అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోసంగి బంగార్రాజు, ఆర్థిక కార్యదర్శి సాధనాల సత్యనారాయణ, హెచ్ఎంలు గుంట్రు వెంకటేశ్వరరావు, కాశి ఘన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ సమాచారం

ఒకచోట పని..మరోచోట చెల్లింపులు

ఉపాధి హామీ కూలీల ఫిర్యాదు మేరకు ఏపీవో విచారణ



విచారణ నిర్వహిస్తున్న ఏపీవో

ఎటపాక, ఏప్రిల్11: ఒక చోట ఉపాధి హామీ పని చేసి...వేరొక చోట అదే కూలీలకు వర్క్ ఐడీతో నగదు చెల్లింపులు జరిగిన అంశంపై కృష్ణవరం గ్రామంలో బుధవారం ఉపాధి హామీ ఏపీవో ఎస్.రాఘవయ్య విచారణ జరిపారు. ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగినట్లు గ్రామానికి చెందిన కొందరు కూలీలు ఉపాధి హామీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దాంతో ఏపీవో రాఘవయ్య కృష్ణవరంలో ఉపాధి పనులు జరిగే చోటకు వెళ్లి కూలీల మధ్య విచారణ నిర్వహించారు. గత జనవరి, ఫిబ్రవరి నెలల్లో గొందిరాజుపేట, గన్నవరం, అయ్యవారిపేట గ్రామాలకు చెందిన సుమారు 21 మంది బినామీ కూలీలు 6 వారాలు పాటు ఉపాధి పనులు చేసినట్లు మస్టర్‌లో నమోదు చేశారని, దానిని గుర్తించి, విచారణ జరుపుతున్నట్లు ఏపీవో రాఘవయ్య తెలిపారు. అయితే పనులు చేసిన వర్క్‌లో నగదు లేకపోవడంతో వేరే చోట వర్క్ ఐడీతో కూలీలకు పేమెంట్ చేసినట్లు ఫీల్డ్ అసిస్టెంట్ వివరణ ఇచ్చారు. ఈ క్రమంలోనే ఏపీవో రాఘవయ్య ఉపాధి హామీ వెబ్‌సైట్ మస్టర్ వెరిఫికేషన్ సైతం పరిశీలించారు. అయితే సంబంధిత టెక్నికల్ అసిస్టెంట్ వర్క్ డిమాండ్ అంచనాలను పరిశీలించకుండా పనికి వర్క్ డిమాండ్ ఇచ్చారనే విమర్శలు వెలువడుతున్నాయి. సుమారు రూ.70 వేల వరకు పనుల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ఏపీవో రాఘవయ్యను వివరణ కోరగా ఒకచోట పని చేసి, వేరే చోట వర్క్ ఐడీతో పేమెంట్లు జరిగినట్లు గుర్తించామని, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

అడ్డతీగల, ఏప్రియల్ 11: రంజాన్ పవిత్ర దినాన్ని పురస్కరించుకొని జామియా మసీదులో అధ్యక్షుడు ఎస్కే హజరత్ ఆధ్వర్యంలో రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు దంగేటి సత్తిబాబు శుభాకాంక్షలు తెలిపారు. అడ్డతీగల, గంగవరం, వై.రామవరం మండలాలకు చెందిన ముస్లింలు పాల్గొన్నారు.

మోతుగూడెంలో



మోతుగూడెం, ఏప్రిల్ 11: చింతూరు మండలం మోతుగూడెంలో గురువారం జామియా మసీదులో మత పెద్ద ఎండీ బర్కత్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లింలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో షరీఫ్ రామ్‌తుల్లాఖాన్ పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యం



మాట్లాడుతున్న జనసేన నాయకులు

చింతూరు, ఏప్రిల్ 11: రంపచోడవరం నియోజకవర్గంలో కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా జనసేన కృషి చేస్తుందని జనసేన నాయకుడు ఆనందం పెద్ద అన్నారు. ఆ దిశగా తమ పార్టీ నాయకత్వం, కార్యకర్తలు, అభిమానులు ఒక ప్రణాళిక రూపొందించుకున్నట్లు తెలిపారు. చింతూరులో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. శుక్రవారం చింతూరులో ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత, ఎమ్మెల్యే అభ్యర్థి మిరియాల శిరీష ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం విజయవంతానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. తమ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీ సాధించే దిశగా జనసేన అడుగులు వేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు నక్క శేఖర్, చిచ్చడి రమ్య, నక్క వినోద్, పీహెచ్ ఆకాష్, కోట మహేష్, జి.బద్రి, తుర్రం అఖిల్, బంగారు రవీంద్ర పాల్గొన్నారు.

నిర్వాసితులను ఆదుకోవడంలో విఫలం

చింతూరు, ఏప్రిల్ 11 : పోలవరం నిర్వాసితులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రంపచోడవరం నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి బంగారు వెంకటేష్ ఆరోపించారు. చింతూరు మండలం, ఉలుమూరులో గురువారం ఆయన ప్రచారం నిర్వహించారు. పోలవరం కారణంగా రెండు తెలుగు రాష్ట్రాలలో దాదాపు 400 గ్రామాలు నీట మునగనున్నాయన్నారు. కాగా ప్రాజెక్టు నిర్మాణంపై దృష్టి సారించిన ప్రభుత్వం నిర్వాసితులకు పునరావాసం, పరిహారం చెల్లింపులో మాత్రం మొండి చేయి చూపిందన్నారు. పులి వీరయ్య, ముచ్చిక భీమయ్య, ముచ్చిక మల్లయ్య, పులి సాగర్, పూనెం కన్నారావు, పండా ముత్తయ్య, పులి మున్ని పాల్గొన్నారు.

డొంకరాయిలో పూలే జయంతి

మోతుగూడెం, ఏప్రిల్11: వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ, డొంకరాయి గ్రామంలో ఎంపీటీసీ కరకా వెంకటరమణ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబాపూలే జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ కె. రమణ మాట్లాడుతూ పూలే జీవిత చరిత్రను అధ్యయనం చేసి విద్యార్థులు స్ఫూర్తి పొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ కార్యకర్తలు కపిల్, సత్యనారాయణ, యాకోబు, తాళి, రత్నంరాజు, ప్రేమకిరణ్, రాము, శివ, అనిల్, వర్తక సంఘం, కాంట్రాక్టర్స్, యూనియన్ ప్రతినిధులు, బీసీ, ఎస్సీ, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు, స్వీట్లు పంచారు.

సామాజిక విప్లవవేత్త ఫూలే

- బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సానబోయిన
- పూలే ఆశయాలను సాకారం చేద్దాం : ముప్పాళ్ల
- జయంతి కార్యక్రమంలో మహాత్ముడికి పలువురి నివాళి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 11: బడుగుబలహీనవర్గాలను విద్యావంతులుగా తీర్చిదిద్దిన మహాత్మా జ్యోతిరావు ఫూలే సామాజిక విప్లవవేత్త అని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సానబోయిన రామారావు అన్నారు. రాజమహేంద్రవరం తిలక్ రోడ్డులోని సంఘం కార్యాలయంలో గురువారం పూలే జయంతి నిర్వహించారు. పూలే చిత్రపటానికి సంఘం కోశాధికారి గుత్తుల సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి గొర్సా తాతబ్బాయి యాదవ్ పూలమాలలతో నివాళులర్పించారు. రాజమండ్రి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. జోతిరావుపూలే చిత్రపటానికి ముప్పాళ్ల సుబ్బారావు, బార్ అధ్యక్షుడు తవ్వల వీరేంద్రనాథ్, ఉపాధ్యక్షురాలు నాగదేవర స్వర్ణపాప తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆనాటి సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాటం సాగించిన మహనీయుడు పూలే అని కొనియాడారు. మూల్ నివాస్ సంఘ్, బీసీ సంక్షేమ సంఘం నగర మాజీ అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 3వ వార్డు రాజేంద్రనగర్‌లో పూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పల్లా వెంకటేశ్వరరావు, కాలెపు సత్యసాయిరామ్, మదీనా



కడియం: జేగురుపాడులో పూలే విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం



రాజమహేంద్రవరంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముప్పాళ్ల

భాషా, అమీర్, ధనర్సింగ్ బ్రహ్మజీ, ఖలీల్ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం అర్బన్: మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను రాజమహేంద్రవరం బీసీ బాలుర హాస్టల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్టల్ ఆవరణలోని పూలే, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వసతిగృహం సంక్షేమాధికారులు ముత్యాల సుబ్బారావు, కె.సుందరమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

అనపర్తి: అనపర్తిలోని కెనాల్ రోడ్డులో పూలే విగ్రహానికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపి ఆశాజ్యోతిగా నిలిచిన జ్యోతిరావు పూలే చిరస్మరణీయుడని, గొప్ప సంఘ సంస్కర్తగానే కాకుండా మహిళా విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేసిన మహనీయుడన్నారు. కార్యక్రమంలో తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, మామిడిశెట్టి శ్రీను, బాసి, కర్రి వెంకటరెడ్డి, వోగిరెడ్డి సత్తిరెడ్డి, వైజాగ్ శ్రీను, నల్లా చిన్నారావు పాల్గొన్నారు.

బిక్కవోలు: బిక్కవోలు వంతెన వద్ద జ్యోతిబా పూలే విగ్రహానికి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశంలో మహిళల విద్యకు నాంది పలికిన వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రొంగల పద్మావతి, వైస్ ఎంపీపీ బుద్దాల కన్నారావు, వైసీపీ నాయకులు పోతుల ప్రసాదరెడ్డి, కిలపర్తి సత్యనారాయణ, తాళ్ల నిరంజన్, యామన దుర్గారావు, కోరుకొండ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కడియం: జేగురుపాడులో జ్యోతిరావు పూలే విగ్రహానికి పలువురు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఆకుల సుధాకర్, మారిశెట్టి నాగన్న, సాకా కిరణ్‌కుమార్, బుడ్డిగ లక్ష్మణరావు, డాక్టర్ సుదర్శనరావు పాల్గొన్నారు.

రంజాన్ వేడుకలు

- మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు
- మతగురువుల దైవ సందేశాలు.. పలువురికి దానధర్మాలు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 11: పవిత్రతకు ప్రతీక రంజాన్ అని రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ , మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. రంజాన్ పండుగను ముస్లింలు గురువారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. నెహ్రూనగర్ ఈద్గాతో పాటు పలు మసీదుల వద్ద గురు వారం జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని ముస్లిం సోదరులకు ఈద్ ముబారక్ తెలిపారు. అనంతరం రాజమహేంద్రవరం 35వ డివిజన్‌లో ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి తనయుడు దగ్గుబాటి హితేష్ చెంచురామ్ ఇంటింటా ప్రచారం చేశారు.డివిజన్ ఇన్‌చార్జి కరగాని వేణు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో యాళ్ల ప్రదీప్, ఉప్పులూరి జానకిరామయ్య నక్కెళ్ల హరి, అనిశెట్టి నాగరాజు, భాస్కర్, సత్తిబాబు పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని పందలపాక అహలే సున్నత్ వల్ జమాత్ జామియా మస్జీద్‌లో గురువు షేక్ గులామ్ గౌస్ అందరితో ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. అనంతరం ఒకరికొకరు ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలుపుకుని పేదలకు వివిధ దానాలు చేశారు. కార్యక్రమంలో భాష మాస్టర్,



బిక్కవోలు: పందలపాక మస్జీద్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

జడ్పీ కోఆప్షన్ మాజీ మెంబర్ మొహ్మద్ పీర్, మదినా, వల్లీషాలతో పాటు తొస్సిపూడి, కొమరిపాలెం, కొంకుదురు గ్రామంలోని ముస్లింలు పాల్గొన్నారు. బిక్కవోలు, బలభద్రపురం గ్రామాల్లోని మస్జీద్‌లలో కూడా ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు.

కడియం: వీరవరం మస్‌జిద్-ఏ-ముబాకర్‌లో రంజాన్ ప్రార్థనలు జరిగాయి. మస్‌జిద్ ఇమాం మహ్మద్ దాదాషరీఫ్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఇష్టదైవాన్ని ఆరాధించాలి. శాంతి నెలకొల్పాలి. ధర్మం తో జీవించాలి అన్నారు. రంజాన్ ప్రార్థనలు చేసారు. ఈ కార్యక్రమంలో షేక్ సిద్దయ్య, నాగూర్, యూసఫ్, మౌలానా తదితరులు పాల్గొన్నారు. అలానే మండలలో కడియం, వేమగిరి, పొట్టిలంక, దుళ్ల మస్‌జిద్‌లలో రంజాన్ ప్రార్థనలు జరిపారు.

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి

- రాజమహేంద్రవరం రూరల్ అభ్యర్థి గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 11: టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని రాజమహేంద్రవరం రూరల్ అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. గుడ్ మార్నింగ్‌తో మీ ఇంటికి మీ గోరంట్ల కార్యక్రమంలో భాగంగా రూరల్ మండలం బొమ్మూరు పరిధిలో సామనవారి తోటలో పార్టీ మండలాధ్యక్షుడు మత్సేటి శివసత్య ప్రసాద్ ఆధ్వర్యంలో కుమార్తె కంఠమనేని శిరీషతో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. ముందుగా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం కూటమి శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ నాడు తెలుగుదేశం హయాంలో పురోగమించిన రాష్ట్రం నేడు అధః పాతాళంలోకి పడిపోయిందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లేదని, మహిళా సాధికారత, భద్రత అటకెక్కిందని, పెట్టుబడుల మాటేలేదని, నిరుద్యోగం పెరిగిపోయిందని అన్నారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కామిని భాస్కరరావు, భీమరశెట్టి రమేష్, కామిని ప్రసాద్, బొప్పన నాగేశ్వరరావు, పెండ్యాల రామకృష్ణ, బొప్పన శ్రీను, దారా అన్నవరం, కోటిపల్లి అమ్ములు పాల్గొన్నారు.

కూటమి విజయానికి సమష్టి కృషి : బత్తుల

రాజానగరం, ఏప్రిల్ 11: రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా సమష్టి కృషి చేయాలని టీడీపీ-జనసేన-బీజేపీ నియోజకవర్గ అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ పిలుపునిచ్చారు. మండలంలో నరేంద్రపురంలో గురువారం నిర్వహించిన బీజేపీ ఆత్మీయ పరిచయ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చిన్న చిన్న లోపాలు, లోటుపాట్లు ఉన్నప్పటికీ వాటిని సర్దుబాటు చేసుకుని విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఓటమి భయంతో చీప్ ట్రిక్స్'

సీతానగరం, ఏప్రిల్ 11: వైసీపీ నాయకులు ఓటమి భయంతో చీప్ ట్రిక్స్‌కు పాల్పడుతున్నారని ప్రజలు గుర్తించాలని జనసేన నాయకురాలు బత్తుల వెంకటలక్ష్మి అన్నారు. గురువారం బొబ్బిల్లంకలో ఇంటింటి ప్రచారం నిర్వహించి కూటమి మేనిఫెస్టోను వివరించారు. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గ అభ్యర్థి బలరామకృష్ణను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పోలిన కృష్ణ, అవిస్వామి, చిట్టూరి రంగారావు, మూడు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రంగంపేట: నల్లమిల్లి సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

ఎన్నికలకు సిద్ధం కండి

- మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి
- ముఖ్యనాయకులు, బూత్‌ఇన్‌చార్జిలతో సమావేశం

రంగంపేట, ఏప్రిల్ 11: మే నెలలో జరిగే ఎన్నికలకు నాయకులు, బూత్ ఇన్‌చార్జిలు సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని నల్లమిల్లి, సింగంపల్లి, మర్రిపూడి గ్రామాల్లో ముఖ్యనాయకులు, బూత్‌ఇన్‌చార్జిలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో ఓటరు లిస్టులను పరిశీలించాలన్నారు. అనపర్తి ఎమ్మెల్యే టిక్కెటు కేటాయింపుపై అధికారికంగా ప్రకటన వెలువడే వరకూ న్యాయం కోసం నల్లమిల్లి కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఐదేళ్లుగా రాజకీయంగా స్తబ్ధంగా ఉన్న పడాల రాము సంఘీభావం తెలపడం శుభపరిణామమన్నారు. వలంటీర్లకు రూ.10 వేలు గౌరవభృతి, పింఛను రూ.4 వేలకు పెంపును ప్రజల్లోకి తీసుకెళ్లా లన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవింద్, మండలాధ్యక్షుడు వెలుగుబంటి సత్తిబాబు, ఉద్దంగ్రావు శ్రీను, రాము గోవింద్, పోతురాజు సుబ్బారావు, కృష్ణ, రాంబాబు, సత్తిరాజు, పుట్టా సోమన్నచౌదరి పాల్గొన్నారు.

నిరవధిక దీక్ష విరమణ

అనపర్తి, ఏప్రిల్ 11: అనపర్తి అసెంబ్లీ సీటును ముందుగా ప్రకటించిన విధంగా టీడీపీకి కేటాయించాలని నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని అభ్యర్థిగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బిక్కవోలు మండలం కొంకుదురులో టీడీపీ నాయకుడు కర్రి సత్యనారాయణరెడ్డి(కలెక్టర్) చేపట్టిన నిరవధిక దీక్షను రామకృష్ణారెడ్డి, తనయుడు మనోజ్‌రెడ్డి నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ టీడీపీశ్రేణులు టిక్కెటు విషయంలో అధైర్య పడొద్దని, అధినేత చంద్రబాబు తనకు స్పష్టమైన హామీ ఇచ్చారని, అనపర్తిలో పోటీ చేసేది తానేనన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఆళ్ల గోవిందు, కొవ్వూరి వేణుగోపాలరెడ్డి తదితరులున్నారు.

కార్టూనిస్టు శేఖర్‌కు ప్రత్యేక జ్యూరీ అవార్డు

రాజమహేంద్రవర కల్చరల్ ఏప్రిల్ 11: విశాఖపట్నం కు చెందిన నార్త్ కోస్టల్ ఆంధ్రా కార్టూనిస్టు ఫోరమ్ సంస్థ నిర్వహించిన పోటీల్లో రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ కార్టూనిస్టు శేఖర్‌కు ప్రత్యేక జ్యూరీ అవార్డు లభించింది. విజేతకు నగదు బహుమతిని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ సాహిత్యవేదిక మీద ఈ నెల 14వ తేదీన జరిగే కార్యక్రమంలో అందజేస్తారని కార్టూనిస్టు శేఖర్ తెలిపారు.

అనంత సంఖ్యాక శివలింగాల తయారీ

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 11: శ్రీ భోగలింగ ధార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో సరస్వతీఘాట్ వద్ద అనంత సంఖ్యాక పార్థివ శివలింగాల తయారీకి (బంకమట్టితో) విచ్చేస్తున్న భక్తులకు జ్ఞాన సరస్వతీ పీఠం వ్యవస్థాపకుడు తోట సుబ్బారావు గురువారం ఘన స్వాగతం పలికారు. బుధవారం నుంచి 15 రోజుల పాటు కొనసాగే ఈ సేవా కార్యక్రమాలు ఉదయం 9నుంచి 11గంటల వరకు, సాయంత్రం 4నుంచి 7గంటల వరకు జరుగుతుందని భక్తులు హాజరుకావాలన్నారు. వివరాలకు మునునూరి అయ్యప్ప సెల్ 95425 00003, వెంట్రాప్రగడ ఆదినారాయణమూర్తి, సెల్ 99894 88755 నెంబరును సంప్రదించవచ్చని చెప్పారు.

వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా సూర్రెడ్డి

అమలాపురం టౌన్, ఏప్రిల్ 11: వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా అనపర్తి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా పులగం సూర్రెడ్డిని రాష్ట్ర అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తిప్రకటించారు. అమలాపురంలో గురువారం జరిగిన సమావేశంలో సూర్రెడ్డిని అభ్యర్థిగా ఖరారు చేసినట్టు తెలిపారు.

ఉండవల్లితో గిడుగు రుద్రరాజు భేటీ



రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 11: రాజమహేంద్రవరం మాజీ ఎంపి ఉండవల్లి అరుణ కుమార్‌తో పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు భేటీ అయ్యారు. రాజమహేంద్రవరం ధర్మంచర కమ్యూనిటీ హాలులో గురువారం మధ్యాహ్నం ఉండవల్లిని మర్యాదపూర్వకంగా గిడుగు కలిశారు. అనంతరం రాజమహేంద్రవరం నారాయణపురం వాంబేకాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఏఐసీసీ రాష్ట్ర పరిశీలకులు మనోజ్ చోహన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, ఎమ్మెల్యే అభ్యర్థి బోడా వెంకట్ ఉన్నారు.

నామినేషన్లలో సందేహాల నివృతికి హెల్ప్‌డెస్క్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 11: నామినేషన్ దాఖలు చేయడంలో ఉన్న సందేహాలను నివృతి చేసేందుకు కార్పొరేషన్ కార్యాలయం మొదటి అంతస్తులో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ ఆర్వో దినేష్ కుమార్ తెలిపారు. వచ్చే నెల 13న జరిగే ఎన్నికలకు ఈనెల 18 నుంచి నామి నేషన్లు స్వీకరించాలన్నారు. ఈ నెల 12 శుక్రవారం నుంచి హెల్ప్‌డెస్క్ ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తుందన్నారు.

మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించాం

కిమ్స్(బొల్లినేని) ఆస్పత్రి యాజమాన్యం

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): అంతర్వేదికి చెందిన మోహన్‌రావు ఆరోగ్యం మెరుగుపడి తర్వాత మళ్లీ తీవ్రమైన సమస్యలు రావడంతోనే మృతిచెందాడని కిమ్స్(బొల్లినేని) ఆస్పత్రి యాజమాన్యం పేర్కొంది. ప్రతి ఒక్క రోగి పట్ల ప్రత్యేక శ్రద్ధతో వైద్యం అందిస్తామన్నారు. అంతర్వేదికి చెందిన మోహన్‌రావును విషమ పరిస్థితుల్లో ఆస్పత్రికి తీసుకురాగా వైద్యం అందించామని, మంగళవారం రాత్రి చనిపోయారని, ఆ విషయాన్ని వెంటనే కుటుంబీకులకు చెప్పామని పేర్కొన్నారు. అప్పటికి బిల్లులు పెండింగ్ ఉన్నమాట వాస్తవమన్నారు. వాటిని చెల్లించాలని తమ సిబ్బంది కోరారని, అయితే ఇబ్బందుల్లో ఉన్నామని వారు చెప్పడంతో బిల్లులో సగం వరకూ మినహాయింపు ఇచ్చామన్నారు. దీనిపై విచారణ చేసి బుధవారం రాత్రి మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించామని యాజమాన్యం తెలిపింది.

పురందేశ్వరిని కలిసిన గన్ని కృష్ణ



రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 11: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం కూటమి ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి, దగ్గుబాటి వెంకటేశ్వరరావు దంపతులను టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. రాజమహేంద్రవరం హోటల్ షెల్టాన్‌లో గురువారం వారిని కలిసి ఎన్నికల నేపథ్యంలో పలు అంశాలపై చర్చించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

సీతానగరం, ఏప్రిల్ 11: సీతానగరం మండలం పురుషోత్తపట్నంలో బెత్లెహేం హౌస్ ఆఫ్ బెడ్ వృద్ధాశ్రమంలో ఉంటున్న సామర్లకోటకు చెందిన కాంతమ్మ(58) గురువారం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. గత నెల 26న గుర్తుతెలియని వ్యక్తులు కాంతమ్మను వృద్ధాశ్రమం వద్ద వదిలి వెళ్లిపోయారు. ఆమె అనారోగ్యంతో ఉండడంతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందగా ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు. మృతురాలి వివరాలు తెలియాల్సి ఉందని, మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి మార్చురీలో ఉంచామని, వివరాలు తెలిసిన వారు స్థానిక పోలీసు స్టేషన్‌లో తెలియబర్చాలని ఎస్ఐ చెప్పారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

సీతానగరం, ఏప్రిల్ 11: పేకాడుతున్న నలుగురు వ్యక్తులు అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ టి.రామకృష్ణ గురువారం తెలిపారు. మండలంలోని ఉండేశ్వరపురం శివారున పేకాడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.4,500 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

మూడెకరాల్లో జీడిమామిడి తోట దగ్ధం

చాగల్లు, ఏప్రిల్ 11: చాగల్లులో జరిగిన అగ్నిప్రమాదంలో సుమారు మూడు ఎకరాల్లో జీడిమామిడి తోట దగ్ధమైంది. బాధిత కౌలు రైతు దొంగ దానయ్య తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని నెలటూరుకు చెందిన నిమ్మగడ్డ దొరబాబుకు ఆరెకరాల జీడిమామిడి తోట ఉంది. దానిని దానయ్య కౌలుకు తీసుకున్నాడు. సుమారు రూ.లక్ష పెట్టుబడి పెట్టాడు. అయితే బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో మూడెకరాల మేరకు తోట దగ్ధమైంది. కాలనీకి తాగునీరు సరఫరా చేసే విద్యుత్ మోటారుకు వెళ్లిన వైరు తోట కంచెగా ఉన్న తుప్పల్లో పడి ఉండడంతో షాట్ సర్క్యూట్ సంభవించి మంటల చెలరేగడంతో మంటలు విస్తరించి తోట కాలిపోయినట్టు తెలిపారు.

రాష్ట్రంలో రాక్షస పాలనను తరిమికొట్టాలి

అరకు పార్లమెంట్ కూటమి అభ్యర్థి కొత్తపల్లి గీత



ప్రచారంలో ఉమ్మడి ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత

మారేడుమిల్లి, ఏప్రిల్ 11: రాష్ట్రంలో నడుస్తున్న రాక్షస పాలనను తరమికొట్టాలని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అరకు పార్లమెంట్ అభ్యర్థి కొత్తపల్లి గీత అన్నారు. రంపచోడవరం కూటమి అసెంబ్లీ అభ్యర్థి మిరియాల శిరీషాదేవితో కలిసి మారేడుమిల్లిలో గురువారం ఆమె పర్యటించారు. వారికి కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కొత్తపల్లి గీత మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో రోడ్ల సౌకర్యం లేక విద్య, వైద్యం, మౌలిక వసతులు లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని కేంద్ర ప్రభుత్వం అందించిన పలు పథకాల నిధులను జగన్ ప్రభుత్వం దారి మళ్లించి గిరిజనులను ఇబ్బందులు పాలు చేసిందని ఆరోపించారు. రంపచోడవరం నియోజకవర్గంలో సైకో ఎమ్మెల్సీ అనంతబాబు రాక్షసుడిలా మారి గిరిజన సంపదను దోచుకుంటున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వారికి సరైన బుద్ధి చెప్పి కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆమె అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీడిమామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ నరసింహారావు



దివాన్‌చెరువు, ఏప్రిల్ 11: రైతులు జీడిమామిడిలో మెళకువలు పాటించి సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టడం ఎంతో అవసరమని దివాన్‌చెరువులోని ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ చల్లా వెంకటనరసింహారావు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ జీడిమామిడి చెట్లకు ఆగర్భ శత్రువుగా చెప్పుకునే కాండం, వేరు తొలుచు పురుగు చెట్టును సమూలంగా నాశనం చేస్తుందన్నారు. సాధారణంగా ఇది ఎక్కువగా ముదురు, నిర్లక్ష్యం చేయబడిన తోటల్లో సంవత్సరం పొడవునా కనిపిస్తుందన్నారు. కానీ డిసెంబరు నుంచి మే మాసాల్లో నష్టతీవ్రత ఎక్కువగా ఉంటుందని చెప్పారు. ఈ పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు కొమ్మలు ఎండిపోయి చివరకు చెట్లు చనిపోతాయని, దీని జీవితచక్రం దాదాపు ఏడాది పాటు ఉంటుందన్నారు. ఈ పురుగు ఆశించిన చెట్లను ముఖ్యంగా ముదిరిన దశలో రక్షించడం కష్టమని, ప్రారంభ దశలోనే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. సాధారణంగా ఈ పురుగు నిర్లక్ష్యం చేయబడిన గింజల ద్వారా ప్రవర్ధనం చేసిన ఏడేళ్ల పైబడిన ముదురు తోటలను మాత్రమే ఆశిస్తుందని చెప్పారు. కాబట్టి ఏడేళ్ల ఆపై వయసున్న చెట్లు కాండము మొదట (మూడడుగుల ఎత్తు వరకూ) భూమిపైన కనబడే వేర్లు, సన్నని ఇనుపవైరుతో చేసిన బ్రష్‌తో బాగా రుద్ది ఆ తర్వాత బాగా తడిచేలా 5శాతం వేపనూనె ద్రావణాన్ని 4 నెలలకోసారి చొప్పున ఏడాదిలో మూడుసార్లు పిచికారీ చేయడం లేదా పూత పూయడం చేయాలని సూచించారు. ప్రతి లీటరు నీటికి 0.5గ్రాముల సబ్బు గాని, సర్ఫ్ గాని కలిపి గిలకొట్టి ఆపై 50మి.లీ. వేపనూనెను బాగా కలిసేటట్లు కలియబెట్టాలన్నారు. ఈ విధంగా కాండాన్ని, వేర్లను బ్రష్‌తో రుద్ది వేపనూనె 5శాతం ఏడాదికి మూడు సార్లు పిచికారీ చేస్తే తోటలోని చెట్లకు ఈ పురుగు సోకే అవకాశం తగ్గుతుందన్నారు. ఈ పురుగు ఆశించిన చెట్లు నుంచి బంక కారుతుంటుందని, వెంటనే బెరడు కింద దాగి ఉన్న లద్దె పురుగులను తొలగించాలని సూచించారు. బెరడు చెక్కిన చోట వెంటనే లీటరు నీటికి క్లోరిపైరిఫాస్ 10మి.లీ కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈ పురుగులను తొలగిస్తే క్రమేణా చెట్లు చనిపోతాయని చెక్కిన బెరడు ముక్కలను కాండం నుంచి కారిన బంకను చెక్కపొడిని భూమిలో పాతిపెట్టాలని చెప్పారు. ఆకులు పూర్తిగా పసుపురంగుకు మారగానే చెట్లను వేర్లతో తీసేసి వేర్లలోని ప్యూపాలను చంపి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. చెట్లు తొలగించిన గుంటల్లో చెత్త వేసి తగులబెట్టాలని సూచించారు.



మీ కోసమే వెయిటింగ్ : ఆనందంగా స్వాగతం పలుకుతున్న యువత



నీరాజనసీమ





పి.గన్నవరంలో ఇదే టీమ్ : అంబాజీపేటలో అభ్యర్థులతో కలిసి అభివాదం



పవన్..చంద్రబాబుతో అమలాపురం అభ్యర్థి ఆనందరావు



అదిరిన అంబాజీపేట రోడ్ షో

- వెల్లువెత్తిన అభిమానం
- అడుగడుగునా ఘనస్వాగతం
- కొబ్బరికి పూర్వవైభవం తెస్తాం
- బహిరంగ సభలో చంద్రబాబు, పవన్
- అంబాజీపేట,అమలాపురంలలో సక్సెస్

అమలాపురం/అంబాజీపేట (ఆంధ్రజ్యోతి), ఏప్రిల్ 11 : కోనసీమలో గన్నవరం గర్జించింది.. అమలాపురం అదరగొట్టింది.. కోనసీమ టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు నీరాజనసీమగా మారింది..ఎటు చూసినా జనమే.. ఎక్కడ చూసినా జనమే.. ఎక్కడి కక్కడ పువ్వులు చల్లుతూ అభిమాన నేతలకు ఘనంగా స్వాగతం పలికారు.. కోనసీమ అభిమానం రుచి చూపించారు..టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రోడ్‌షోకు ప్రజలు అపూర్వ రీతిలో స్వాగతాలు పలికారు. మహిళలైతే రోడ్లపైకి వచ్చి హారతులు ఇచ్చారు. ఆరు కిలోమీటర్ల రోడ్‌షో గంటన్నర సమయం పైగా సాగింది. రోడ్లకు ఇరువైపులా వేల సంఖ్యలో ప్రజలు బారులు తీరి స్వాగతం పలికారు. అంబాజీపేటలో మెయిన్‌రోడ్డుమీదా, అమలాపురంలో గడియార స్తంభం సెంటర్‌లో సభ, రోడ్‌షో సుమారు నాలుగు గంటలపాటు జరిగాయి. దీంతో నేతలు ఉబ్బితబ్బిబయ్యారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌లు ఈసారి స్థానిక సమస్యలపైనే దృష్టి సారించి రెండు సభల్లోను ప్రసంగాలు చేశారు. ప్రభుత్వ వ్యతిరేకతకు అద్దంపట్టే స్పందన ఇక్కడ కనిపిస్తోంది. ఇక్కడ ఎన్నికలు లాంఛనమే. మనమే గెలుస్తున్నాం. మన ఆడబిడ్డల స్పందన చూస్తుంటే, వీర వనితలు అయితే ఎప్పుడు పోలింగ్ వస్తుందా అని ఎదురుచూస్తున్నారు. సిద్ధం అంటున్న జగన్‌కు ఇక యుద్ధమేనని చంద్రబాబు అన్నారు. పి.గన్నవరం నియోజకవర్గంలో గాజుగ్లాసు..అమలాపురంలో సైకిల్ గుర్తులకు ఓట్లేసి తద్వారా జగన్మోహన్‌రెడ్డి గుండెల్లోకి గుచ్చేందుకు చూస్తున్నారు. సిద్ధం.. సిద్ధం అంటున్న జగన్‌ను తన్ని తరిమికొట్టాలన్నారు. కోనసీమకు వన్నె తెచ్చిన వ్యక్తి బాలయోగి అన్నారు. బాలయోగిని స్పీకర్‌గా చేసిన పార్టీ టీడీపీ అన్నారు. గోదావరి జిల్లాలో చిచ్చుపెట్టి చలికాచుకునే పరిస్థితుల్లో జగన్ ఉన్నాడని చంద్రబాబు విమర్శించారు. గోదావరి ఉన్నా మీకు ఇసుక అందుతుందా అని చంద్రబాబు ప్రశ్నించారు. టీడీపీ హయాంలో రూ.1000కే ఇసుక అందేదన్నారు. ఇప్పుడు రూ.5 వేలు ఇస్తేకానీ ఇసుక రావడంలేదన్నారు. ఎవరికిపోతున్నాయి ఈ డబ్బులు అని ప్రశ్నించారు. గోదావరి జిల్లాలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని చంద్రబాబు అన్నారు. కోనసీమ కొబ్బరికి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కృషిచేస్తానన్నారు. అలాగే వరికి గిట్టుబాటు ధర కల్పించి రైతుల వద్ద నుంచి పూర్తి స్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం హలో ఏపీ... బై బై జగన్ అంటూ చంద్రబాబు ప్రజలతో నినాదాలు చేయించారు. పవన్‌కల్యాణ్ మాత్రం స్థానిక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రజల సమక్షంలో ఎండగట్టారు. బాబు చిట్టి అంటూ.. పరోక్షంగా స్థానిక ఎమ్మెల్యే చిట్టిబాబు పేరు ప్రస్తావించకుండా ఆయనపై విమర్శనాస్త్రాలు సంధించారు. జగన్ గన్నవరం నియోజకవర్గంలో పర్యటించినప్పుడు ఎమ్మెల్యే చిట్టిబాబు సూచించిన రూ.200 కోట్ల విలువైన హామీలను అయితే ఇచ్చేశారు. ఇప్పటివరకు వాటికి అతీగతీ లేదు. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల నుంచి గోదావరి రివెట్‌మెంట్లు, కాజ్‌వేల నిర్మాణం, నాడు-నేడు వంటి అంశాలపై వివరణాత్మక విశ్లేషణ చేస్తూ జగన్ ఈ ప్రాంత ప్రజలను ఏవిధంగా మోసగించారో స్పష్టంచేశారు. బాలయోగి జీవిత లక్ష్యమైన కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్‌ను నిర్మించి పర్యాటకంగా కూడా అభివృద్ధి చేస్తామన్నారు.ఆర్బీకేలు కాకినాడకు చెందిన ఒక మాఫియా లీడర్ చేతిలో ఉన్నాయని ఆరోపించారు. యువత ఇంటి వద్దే ఉండి ఉపాధి పొందేలా వర్క్ ఫ్రమ్ హోం మాదిరిగా ఉద్యోగ అవకాశాలను కల్పించడమే తెలుగుదేశం లక్ష్యమని చంద్రబాబునాయుడు అమలాపురం సభలో స్పష్టం చేశారు. చంద్రబాబు తన ప్రసంగాన్ని సూపర్-10 పథకాలను వివరిస్తూ సరిగ్గా 9.55 గంటలకు ముగించారు. చంద్రబాబునాయుడు కిమ్స్‌లో నైట్ హాల్ట్‌కు బయలుదేరి 10.15 గంటలకు చేరుకున్నారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అమలాపురం నుంచి నేరుగా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని నివాసానికి వెళ్లారు.



మీకు అండగా ఉంటా : నిడదవోలులో రంజాన్ వేడుకలో మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు



బిజీబిజీగా అధినేతలు

- నిడదవోలులోనే చంద్రబాబు రంజాన్ వేడుక
- రాజమహేంద్రవరంలో నేతలతో పవన్ భేటీ

రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి/నిడదవోలు/రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 11: టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ గురువారం సాయంత్రం 4 గంటల వరకూ జిల్లాలోనే ఉన్నారు. నిడదవోలు ప్రజాగళం సభ ముగిసిన అనంతరం బుధవారం రాత్రి చంద్రబాబు నిడదవోలులో బస చేయగా, పవన్ కల్యాణ్, పురందేశ్వరి రాజమహేంద్రవరం షెల్టన్ హోటల్‌లో బసచేశారు. చంద్రబాబు గురువారం సుమారు 12 గంటల ప్రాంతంలో తిరుమలసాయి కల్యాణ మండపంలో ముస్లింలతో కలిసి రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కేక్ కట్ చేసి ముస్లింలకు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలిపారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వంలో 10 లక్షల మంది పేద ముస్లింలకు ఉచితంగా రంజాన్ తోఫా అందజేసేవారమన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ముస్లింలకు ఆ సంతోషం ఉందా అని ప్రశ్నించారు. గతంలో టీడీపీ ప్రభుత్వం దుల్హన్ పథకం ద్వారా ముస్లిం పెళ్లి జంటలకు రూ.50వేలు అందజేసేవారమని, తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒక్కో జంటకు రూ.లక్ష అందజేస్తామన్నారు. రంజాన్ పండుగను ముస్లింలతో జరుపుకోవడం ఆనందం ఉందన్నారు. చిత్తూరు జిల్లా చంద్రగిరి నియోజకవర్గానికి చెందిన డాలర్ దివాకర్‌రెడ్డి, పెరవలికి చెందిన పసలపూడి భద్రయ్యలకు పసుపు కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. నిడదవోలులో పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సాయంత్రం నాలుగు గంటలకు బ్రాహ్మణగూడెంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకుని హెలికాప్టర్‌లో అంబాజీపేట వెళ్లారు. ఇక పవన్ కల్యాణ్ కూడా షెల్టన్ హోటల్ నుంచే పార్టీ వ్యవహారాలు చూశారు. ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ రాజమహేంద్రవరం అర్బన్, రూరల్, భీమవరం తదితర నియోజకవర్గాల నుంచి పోటీలో ఉన్న తెలుగుదేశం, జనసేన పార్టీ అభ్యర్థులు, ఆయా నియోజకవర్గాల ముఖ్య నాయకులతో విడివిడిగా సమావేశమయ్యారు. నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు, పితాని సత్యనారాయణ, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు, భీమవరం అభ్యర్థి అంజిబాబు, కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, అనుశ్రీ సత్యనారాయణ వంటినేతలు కలిశారు. ఉదయం నాగబాబు పవన్‌ను కలసి వెళ్లారు. సాయంత్రం 4 గంటల తర్వాత పవన్ కారులో మధురపూడి విమానాశ్రయానికి చేరుకుని అక్కడ నుంచి హెలికాప్టర్‌లో అంబాజీపేట వెళ్లారు. మరో పక్క బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పార్టీ కార్యక్రమాల్లో బిజీగా గడిపారు. అనపర్తి మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి పురందేశ్వరితో గురువారం సాయంత్రం భేటీ కావడం గమనార్హం. రేపో మాపో అనపర్తి సీటు విషయంలో స్పష్టత రావచ్చని భావిస్తున్నారు.

రంజాన్ వేడుకలు

- మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు
- మతగురువుల దైవ సందేశాలు.. పలువురికి దానధర్మాలు



కొవ్వూరులో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

కొవ్వూరు, ఏప్రిల్ 11: రంజాన్ పండుగను ముస్లింలు గురువారం వేడుకగా నిర్వహించారు. నూతన వస్త్రాలు ధరించి ఒకరికొకరు ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. మసీదులను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. మతగురువులు దైవ సందేశాలు అందించారు. పలుచోట్ల పేదలకు, అనాథలకు ముస్లింలు వివిధ రకాలైన దానాలు చేశారు. మసీదుల వద్ద ప్రేమ విందులు ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా కొవ్వూరులోని జామియా మసీదులో ముతావలి నౌషద్ అలీ ఆధ్వర్యంలో రంజాన్‌ను జరుపుకున్నారు. ఇమామ్ షమీముర్ రెహమాన్ రంజాన్ విశిష్టతను వివరించారు. అలాగే సత్యవతినగర్‌లోని మర్కజ్ మసీదు, ఔరంగాబాద్, మండలంలోని దొమ్మేరు, కాపవరం, గోవర్ధనగిరిమెట్ట మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రంజాన్ సందర్భంగా ప్రతి ముస్లిం 30 రోజుల పాటు ఉపవాసం పాటిస్తూ, దానధర్మాలను చేయాలని ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు సల్లం ఖురాన్ గ్రంథంలో పేర్కొన్నారని ముస్లిం పెద్దలు చెప్పారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మికతల కలయిక రంజాన్ అని అన్నారు.

నల్లజర్ల: మండలంలోని ఆవపాడు మసీదులో ఇమామ్ సయ్యద్ పరహల్ భక్తులతో నమాజ్ చేయించారు. మసీదు అధ్యక్షుడు షేక్ మీరాసాహెబ్, సాలీమ్, అలీమ్, మీరాంజి, అసాన్, రహీమ్, సయ్యద్ అల్లీ పాల్గొన్నారు. నల్లజర్ల మీనార్ మసీదులో ఆలీసాహెబ్, మీరా సాహెబ్, షరీఫ్, ఆజీజ్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పెరవలి: పెరవలి మసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లింల మత గ్రంథమైన ఖురాన్ ఈ మాసంలోనే ఆవిర్భవించిందని మహ్మద్ హస్సేన్ ఆలీ తెలిపారు.

తాళ్లపూడి: తాళ్లపూడిలోని అబూ బకర్ వజీదులో రంజాన్ వేడుకలు నిర్వహించారు. అనంతరం ప్రక్కిలంక శివారులోని ఈద్‌గా వరకూ పాదయాత్రగా వెళ్లి అక్కడ ప్రార్థనలు చేపట్టారు. ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని పాలంగి, ఉండ్రావరం, మోర్త, వేలివెన్ను, చిలకపాడు, చివటం, సూర్యారావుపాలెం తదితర గ్రామాల్లో మసీదులకు విద్యుత్ అలంకరణలు చేశారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిమ్‌లు ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

దేవరపల్లి: మండలంలోని దేవరపల్లి, లక్ష్మీపురం, చిన్నాయిగూడెం, దుద్దుకూరు, రంగరాయ కాలనీ, యర్నగూడెం తదితర గ్రామాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



తాళ్లపూడిలో రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్

భద్రయ్య టీడీపీలో చేరిక



పెరవలి, ఏప్రిల్ 11: వైసీపీ నాయకుడు, కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, కుమ్మరి సాలివాహన సంఘం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు పసలపూడి భద్రయ్య (బుజ్జి) చంద్రబాబు సమక్షంలో గురువారం నిడదవోలులో టీడీపీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పిలుపు మేరకు తాను టీడీపీలో చేరినట్టు భద్రయ్య తెలిపారు. వైసీపీ పాలనలో కార్పొరేషన్ ద్వారా తమకు చేసిందేమీ లేదని, కేవలం అలంకరణ ప్రాయంగానే పదవులు మిగిలాయని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి రాగానే కుమ్మరి సాలివాహనులకు వృత్తిపరంగా ప్రోత్సాహం అందజేస్తామని చంద్రబాబు హామీ యిచ్చినట్టు చెప్పారు.

టీడీపీకి రూ.లక్ష విరాళం



నిడదవోలుకు చెందిన దాపర్తి రాజేశ్వరరావు, విశాలక్షి దంపతులు స్థానిక తిరుమల సాయి కళ్యాణ మండపంలో టీడీపీ అధినేత చంద్రబాబుకు రూ.లక్ష విరాళం పార్టీ నిమిత్తం అందజేశారు. వారి వెంట మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, లక్ష్మీ రమణి, కొమ్మిన వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగుల వినతిపత్రం

నిడదవోలులో చంద్రబాబును వైద్య ఆరోగ్యశాఖలో నేషనల్ హెల్త్‌మిషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల రాష్ట్ర నాయకురాలు డి.దయామణి కలిసి వినతిపత్రం అందజేశారు. వైసిపి ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంటు చేస్తామని నమ్మించి మోసగించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తమ సమస్యలను పరిష్కరించి తమకు న్యాయం చేయాలని కోరారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెరవలి, ఏప్రిల్ 11: ఈ నెల 12, 13 తేదీల్లో కానూరు, పెరవలి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతులు, లైన్ల వెంబడి చెట్ల కొమ్మలు తొలగింపు నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ వీరభద్రరావు తెలిపారు. దీని కారణంగా కానూరు, నడిపల్లి, నడిపల్లికోట, ఉసులుమర్రు, పరిసర ప్రాంతాల్లో వ్యవసాయ విద్యుత్ ఉదయం 7గంటల నుంచి 11.30 వరకు సరఫరా ఉండదన్నారు. అలాగే ఖండవల్లి, నల్లాకులవారిపాలెం, అన్నవరప్పాడు, పి.వేమవరం గ్రామాల పరిధిలో ఉదయం 7నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు చెప్పారు.

ఎండలో ప్రయాణాలు తగ్గించండి

తాళ్ళపూడి, ఏప్రిల్ 11: విపత్తుల నిర్వహణ సంస్థ చేసిన హెచ్చరికల నేపథ్యంలో మండలంలో ఎండల ప్రభావంతో పాటు తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని, ప్రజలు జాగ్రత్తలు పాటించాలని తహశీల్దార్ శ్రీనివాసరావు కోరారు. వీలైనంత వరకూ ఉదయం 11గం. నుంచి సాయంత్రం 4గం. వరకూ బయటకు వెళ్లడం తగ్గించాలని, తప్పని పరిస్థితుల్లో వెళ్లవలసి వస్తే తలకు టోపీ ధరించాలని, గొడుగును ఉపయోగించాలని చెప్పారు. ఎక్కువగా మంచినీరు, మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీరు వంటివి తాగుతూ జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

ఫ్లైయింగ్ స్క్వాడ్ తనిఖీలు ముమ్మరం



కొవ్వూరు, ఏప్రిల్ 11: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున కొవ్వూరు, మండలంలో ఫ్లైయింగ్ స్క్వాడ్ తనిఖీలు ముమ్మరం చేశారు. ఇప్పటికే కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి వద్ద ప్రత్యేక చెక్ పోస్టు ఏర్పాటుచేసి నగదు, గిఫ్టులు రవాణా చేయకుండా తనిఖీలు చేపట్టారు. అలాగే పట్టణ, మండలంలో ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఓటర్లను ప్రలోభ పెట్టకుండా ఫ్లైయింగ్ స్క్వాడ్ టీములు వాహన తనిఖీలు చేపట్టాయి. ప్రజలు సరైన పత్రాలు లేకుండా రూ.50 వేలకు మించిన నగదు రవాణా చేయరాదన్నారు. అత్యవసర పనుల నిమిత్తం నగదు తీసుకెళ్లే వారు సరైన పత్రాలను దగ్గరుంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

మూడెకరాల్లో జీడిమామిడి తోట దగ్ధం

నెలటూరులో షార్ట్‌సర్క్యూట్‌తో ఘటన.. కాలిపోయిన చెట్లు



కాలిపోయిన జీడిమామిడితోట

చాగల్లు, ఏప్రిల్ 11: చాగల్లులో ఇందిరమ్మకాలనీ సమీపంలో జరిగిన అగ్నిప్రమాదంలో సుమారు మూడు ఎకరాల్లో జీడిమామిడి తోట దగ్ధమైంది. బాధిత కౌలు రైతు దొంగ దానయ్య తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని నెలటూరుకు చెందిన నిమ్మగడ్డ దొరబాబుకు ఆరెకరాల జీడిమామిడి తోట ఉంది. దానిని దానయ్య కౌలుకు తీసుకున్నాడు. సాగు ఖర్చులు సుమారు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టాడు. అయితే బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో సుమారు మూడు ఎకరాల మేరకు తోట దగ్ధమైనట్టు చెప్పాడు. కాలనీకి తాగునీరు సరఫరా చేసే విద్యుత్ మోటారుకు వెళ్లిన వైరు తోట కంచెగా ఉన్న తుప్పల్లో పడి ఉండడంతో షాట్ సర్క్యూట్ సంభవించి మంటల చెలరేగడంతో మంటలు విస్తరించి తోట కాలిపోయినట్టు తెలిపారు. కొవ్వూరు అగ్నిమాపక సిబ్బంది సాయంతో మంటలను అదుపు చేశారు. ఈ ఘటనతో చెట్లు పూర్తిగా కాలిపోయి తోటకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. నష్టపోయిన తనను ఆదుకోవాలని కౌలురైతు దానయ్య అధికారులను వేడుకున్నాడు.

వేగేశ్వరపురంలో పంట కోత ప్రయోగాలు



తాళ్లపూడి, ఏప్రిల్ 11: మండలంలోని వేగేశ్వరపురంలో పంట కోత ప్రయోగాలు చేపట్టారు. స్థానిక రైతులు బుద్దాల సురేష్, వనమల వీరబాబు పొలాల్లో కొవ్వూరు ఉప గణాంక అధికారి పి.సోమరాజు ప్రయోగాలను పరిశీలించి, ఈపీఆర్ 126 రకం పంట దిగుబడి అత్యధికంగా 50 బస్తాలు పండిందని తెలిపారు. వీరబాబు పొలంలో ఎంటీయూ 1121 రకం కూడా బాగా పండిందన్నారు. ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సరైన సమయంలో మందులు వాడడం వల్ల 50బస్తాల దిగుబడి వచ్చిందని కొనియాడారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

నేడు ఇంటర్ ఫలితాలు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షా ఫలితాలను శుక్రవారం ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు. ఫలితాలను http://results.bie.ap.gov.in వెబ్‌సైటు నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. గత నెల 1 నుంచి మొదటి, 2 నుంచి రెండో ఏడాది పరీక్షలు ప్రారంభమై 20న ముగిశాయి. జిల్లాలో మొదటి ఏడాది 19336, రెండో ఏడాది 18166 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. గత ఏడాది మొదటి ఏడాది 59 శాతం, రెండో ఏడాది 69 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది ఫలితాలు మరింత మెరుగ్గా ఉంటాయని అధికారులు చెబుతున్నారు.

అనాలోచిత విధానాలతో రాష్ట్రం వెనుకబాటు

» టీడీపీ-జనసేన-బీజేపీ గోపాలపురం అభ్యర్థి మద్దిపాటి

గోపాలపురం, ఏప్రిల్ 11: జగన్ అనాలోచిత విధానాలతో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి పోయిందని గోపాలపురం నియోజకవర్గ ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని భీమోలు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వైసీపీ ఎంపీటీసీ సభ్యురాలు కోడి రామలక్ష్మి, దేవివరప్రసాద్ దంపతులతో పాటు మరో 14మంది జనసేనలో చేరారు. మద్దిపాటి జనసేన కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించి, కూటమి అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు చంద్రబాబు అనుభవానికి, ముందుచూపుకు పట్టం గట్టాలన్నారు. ఈ ఎన్నికల్లో జగన్‌ను ఇంటికి సాగనంపడం ఖాయమన్నారు. కాగా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా గ్రామంలోని ఆయన విగ్రహానికి మద్దిపాటి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ, భీమోలు టీడీపీ, జనసేన గ్రామ కమిటీ అధ్యక్షుడు అప్పారావు, ఉమా, సీనియర్ నాయకులు శ్రీను, కొర్లపాటి రాము, జ్యేష్ఠ శ్రీను, బీజేపీ మండల అధ్యక్షుడు గెల్లా శ్రీనుబాబు, వడ్లమూడి రమేష్, టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.



భీమోలులో ఎంపీటీసీ రామలక్ష్మి దంపతులను జనసేనలోకి ఆహ్వానిస్తున్న దృశ్యం

కూటమి గెలుపే లక్ష్యం: ముప్పిడి



చాగల్లులో ముప్పిడికి హారతిస్తున్న బాలిక

చాగల్లు, ఏప్రిల్ 11: కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని టీడీపీ-జనసేన-బీజేపీ నియోజకవర్గ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. చాగల్లు ఇందిరమ్మ కాలనీలో ఓట్లు అభ్యర్థిస్తూ విస్తృత ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా గెలిస్తే పింఛను రూ. 4వేలు ఇస్తామన్నారు. కాలనీలో రోడ్లు, డ్రైన్‌లు అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు సైకిల్ గుర్తుపై, ఎంపీ అభ్యర్థిగా పురందేశ్వరికి కమలం గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా జరిగిన జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. రంజాన్ వేడుకల్లో పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని చంద్రవరంలోను ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆళ్ల హరిబాబు, నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి, దొంగ రామకృష్ణ, ఆళ్ల సూర్యప్రకాశరావు, జనసేన నాయకులు కొప్పాక విజయకుమార్, ఉప్పులూరి చిరంజీవి, బీజేపీ నాయకులు తాళ్ళూరి వరప్రసాద్, మద్దిపాటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి విజయానికి కృషి చేయాలి

దేవరపల్లి, ఏప్రిల్ 11: నియోజకవర్గ అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు, ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి విజయానికి కృషి చేయాలని టీడీపీ మండలాధ్యక్షుడు ఆండ్రూ అనీల్ అన్నారు. మండలంలోని గౌరీపట్నం, దేవరపల్లి గ్రామాల్లో టీడీపీ-బీజేపీ-జనసేన ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసీపీకి వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు గల్లంతవుతాయని, కూటమి కేంద్రంలోను, రాష్ట్రంలోను అధికారం చేపడుతుంన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముప్పిడి సుధీర్, కొఠారు ధ్రువకాంత్, పెనుమత్స సుబ్బరాజు, ముల్లపూడి వెంకట్రావు, బులిరాజు, గన్నమని హరికృష్ణ, కాట్రు భీమరాజు, కొండపల్లి దొరయ్య, బీజేపీ నాయకుడు దాపర్తి నరసింహమూర్తి పాల్గొన్నారు

తీపర్రు విద్యార్థికి గురుకులంలో సీటు

పెరవలి, ఏప్రిల్ 11: తీపర్రు పాఠశాల నెంబర్-1లో 4వ తరగతి చదువుతున్న కోడూరి అఖిలేష్‌కు గురుకులంలో సీటు దక్కింది. ఈ సందర్భంగా విద్యార్థిని, తర్ఫీదు ఇచ్చిన ఉపాధ్యాయులను ఎంఈవోలు బీఎస్ స్వరూప్, షేక్ నూర్జహాన్, పాఠశాల హెచ్ఎం చాముండేశ్వరి, ఉపాధ్యాయులు అభినందించారు.

కార్టూనిస్టు శేఖర్‌కు ప్రత్యేక జ్యూరీ అవార్డు

రాజమహేంద్రవర కల్చరల్ ఏప్రిల్ 11: విశాఖపట్నంకు చెందిన నార్త్ కోస్టల్ ఆంధ్రా కార్టూనిస్టు ఫోరమ్ సంస్థ నిర్వహించిన పోటీల్లో రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ కార్టూనిస్టు శేఖర్‌కు ప్రత్యేక జ్యూరీ అవార్డు లభించింది. ఈ నెల 14ను విజయవాడలో అవార్డు అందుకోనున్నారు.

మహనీయుడు జ్యోతిరావు పూలే

» జయంతి కార్యక్రమంలో టీడీపీ ద్విసభ్య కమిటీ

» మహాత్మునికి పలువురి నివాళులు



కొవ్వూరులో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ద్విసభ్య కమిటీ

కొవ్వూరు, ఏప్రిల్ 11: బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడు మహాత్మ జ్యోతిబా పూలే అని ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి అన్నారు. కొవ్వూరులోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో బీసీ నాయకుడు అర్జిల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిబా పూలే జయంతిని నిర్వహించారు. పూలే చిత్రపటానికి ద్విసభ్య కమిటీ సభ్యులు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, పొట్రు శ్రీనివాసరావు, పెనుమాక జయరాజు, బర్ల శ్రీనివాస్, మాదిరెడ్డి సతీష్, బొబ్బిలి పేర్రాజు, తుంపల్లి ఆదినారాయణ పాల్గొన్నారు. స్థానిక గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కార్యాలయంలో ఆయన కేక్ కట్‌చేసి నాయకులు, కార్యకర్తలకు పంచారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి ఆధ్వర్యంలో పూలే జయంతి నిర్వహించారు. దళిత సంఘాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాలమహాసభ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంటు బొంతా శ్యాం రవిప్రకాష్ పూలే సేవలను వివరించారు. అలాగే మాతృ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

నల్లజర్ల: నల్లజర్లలో అంబేడ్కర్ భవనం వద్ద పూలే విగ్రహానికి అంబేడ్కర్ యూత్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొందల శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళలను బానిసత్వం నుంచి విముక్తులను చేయాలంటే వారికి నిషేధించిన విద్యను అందించాలని భావించి భారతదేశంలోనే మొట్టమొదటి బాలికల పాఠశాలను తన భార్య సావిత్రిబాయి పూలేతో కలిసి స్థాపించి అణగారిన వర్గాల స్త్రీలకు విద్యను అందించిన మహనీయుడు పూలే అని శ్రీను అన్నారు. కార్యక్రమంలో పల్లి సుబ్బారావు, గుదే సుబ్బారావు,పచ్చిగొల్ల శ్రీనివాసరావు, గుదే వెంకటేశ్వరరావు, డేవిడ్, రాజశేఖర్, వినోద్‌కుమార్, కూరపాటి నాగరాజు పాల్గొన్నారు.



నల్లజర్లలో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న అభిమానులు



చాగల్లులో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముప్పిడి